ఎఫ్ఐఆర్ అయ్యాకే అంత్యక్రియలు

యువరైతు మృతిపై తేల్చిచెప్పిన అన్నదాతలు

బాధ్యులైన పోలీసులపై కేసు నమోదు చేయాలని డిమాండ్

పంజాబ్ సరిహద్దుల్లో రైతులపై మళ్లీ టియర్ గ్యాస్ ప్రయోగం

గుండెపోటుతో మరో అన్నదాత మృత్యువాత

ఢిల్లీ మార్చ్ 29 వరకు వాయిదా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23: ఢిల్లీ చలో మార్చ్ సందర్భంగా పోలీసులతో ఘర్షణలో మరణించిన యువరైతు శుభకరణ్ సింగ్ అంతిమ సంస్కారాలపై అన్నదాతలు కీలక ప్రకటన చేశారు. మృతికి బాధ్యులైన వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశాకే మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహిస్తామని తేల్చిచెప్పారు. రైతు మృతికి నిరసనగా శుక్రవారం రైతులు బ్లాక్‌డే పాటించారు. ఈ క్రమంలో పంజాబ్ సరిహద్దులోని ఖనౌరి వైపు వెళ్తున్న రైతులను నిలువరించడానికి పోలీసులు వారిపై టియర్‌గ్యాస్‌ను ప్రయోగించారు. దీంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొన్నది. మరోవైపు,

శంభు సరిహద్దులో నల్ల జెండాలతో నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

నిరసనల్లో పాల్గొన్న మరో అన్నదాత అనువులు బాశాడు. పంజాబ్-హర్యానా సరిహద్దుల్లో ఇటీవల పోలీసులు టియర్‌గ్యాస్ ప్రయోగించడంతో దర్శన్‌సింగ్ అనే రైతు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. శుక్రవారం పరిస్థితి విషమించడంతో దవాఖానకు తరలిస్తుండగా గుండెపోటుతో మరణించారు. ఇప్పటివరకు నలుగురు అన్నదాతలు ప్రాణాలు కోల్పోయారు.

రైతు కుటుంబానికి రూ.కోటి పరిహారం

రైతుల ఆందోళనలో మృతి చెందిన యువ రైతు శుభకరణ్ సింగ్ కుటుంబానికి కోటి రూపాయల పరిహారం, అతని సోదరికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తున్నట్టు పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ ప్రకటించారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. శుభకరణ్ సింగ్‌ను అమరవీరుడిగా ప్రకటించాలని రైతులు డిమాండ్ చేశారు. మరోవైపు, ఆందోళనలో పాల్గొంటున్న కొంత మంది రైతు నేతలపై జాతీయ భద్రతా చట్టం (ఎన్ఎస్ఏ) అమలు చేయాలని తీసుకున్న నిర్ణయాన్ని శుక్రవారం హర్యానా పోలీసులు ఉపసంహరించుకున్నారు. నిరసనల సందర్భంగా ప్రభుత్వ ఆస్తిని ధ్వంసం చేసిన అన్నదాతల ఆస్తులను పోలీసులు జప్తు చేస్తున్నారు.

29న భవిష్యత్తు కార్యాచరణ

ఢిల్లీ చలో మార్చ్‌ను ఈ నెల 29 వరకు నిలిపివేస్తున్నట్టు అన్నదాతలు ప్రకటించారు. భవిష్యత్తు కార్యాచరణను 29న ప్రకటిస్తామని తెలిపారు. ఎంఎస్పీకి చట్టబద్ధత కల్పించడం సహా పలు డిమాండ్ల సాధన కోసం సంయుక్త కిసాన్ మోర్చా(నాన్ పొలిటికల్), కిసాన్ మజ్దూర్ మోర్చా నిరసన చేపడుతున్న సంగతి తెలిసిందే. శుక్రవారం రైతు నాయకుడు కర్వాన్ సింగ్ పందేర్ మాట్లాడుతూ.. శనివారం కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టనున్నట్టు ప్రకటించారు. 26న కేంద్ర ప్రభుత్వ దిష్టి బొమ్మలను దహనం చేస్తామని వెల్లడించారు.

13 తర్వాత లోక్‌సభ షెడ్యూల్!

ఎన్నికల్లో ఏఐ వినియోగం: ఈసీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23: లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ మార్చి 13వ తేదీ తర్వాత విడుదల చేసే అవకాశం ఉన్నట్టు కేంద్ర ఎన్నికల కమిషన్ (ఈసీ) వర్గాలు తెలిపాయి. ఎన్నికల సన్నద్ధతను పరిశీలించేందుకు ఈసీ సభ్యులు వివిధ రాష్ట్రాల్లో సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. ఈ పర్యటనలు ముగియగానే షెడ్యూల్ విడుదల చేసే అవకాశం ఉన్నట్టు వెల్లడించాయి. ఈసీ ప్రస్తుతం తమిళనాడులో పర్యటిస్తున్నది. త్వరలో ఉత్తరప్రదేశ్, జమ్ము కశ్మీర్‌లో పర్యటించనున్నది. మార్చి 13 వరకు ఈ పర్యటనలు ముగియనున్నాయి. ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)ను ఉపయోగించాలని ఈసీ నిర్ణయించింది. అభ్యర్థులు, వారి అనుచరులు ఎవరైనా సోషల్‌మీడియాలో తప్పుడు ప్రచారం చేసినట్టు తేలితే కఠిన చర్యలు తీసుకొంటామని ఈసీ హెచ్చరించింది.

రాహుల్, సిద్ధరామయ్యకు కోర్టు సమన్లు

బెంగళూరు, ఫిబ్రవరి 23: కర్ణాటకలోని గత బీజేపీ ప్రభుత్వంపై కాంగ్రెస్ పార్టీ చేసిన '40 శాతం కమీషన్' ఆరోపణలకు సంబంధించి స్థానిక ప్రత్యేక కోర్టు ప్రస్తుత సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి సమన్లు జారీచేసింది. బీజేపీ చేసిన ఫిర్యాదుపై స్పందించిన ఎంపీ/ఎమ్మెల్యే కోర్టు.. మార్చి 28న కోర్టు ముందు హాజరు కావాలని ముగ్గురు నేతలను ఆదేశించింది. గత ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల వరకు హస్తం పార్టీ బీజేపీకి వ్యతిరేకంగా 40% కమీషన్ సర్కార్ అంటూ పోస్టర్లు, క్యూఆర్ కోడ్‌లతో పెద్దయెత్తున ప్రచారం చేసిన విషయం తెలిసిందే. దీన్ని వ్యతిరేకిస్తూ బీజేపీ లీగల్ విభాగానికి చెందిన వినోద్ కుమార్ అనే న్యాయవాది కాంగ్రెస్ నేతలపై ఫిర్యాదు చేశారు.

విశాఖ తీరంలో 'ఘూజీ' శకలాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (నమస్తే తెలంగాణ): ఇండియా-పాకిస్థాన్ మధ్య 1972లో జరిగిన యుద్ధంలో మునిగిపోయిన పాక్ జలాంతర్గామి ఘూజీ శకలాలను ఇండియన్ నేవీ గుర్తించింది. విశాఖపట్నం డీప్ సబ్‌మెర్జెన్స్ రెస్క్యూ వెహికల్.. ఈ శిథిలాలు కనుగొంది. విశాఖ తీరానికి 2.5 కి.మీ దూరంలో 100 మీటర్ల లోతులో ఈ శకలాలను గుర్తించారు. 1972 యుద్ధంలో బంగాళాఖాతంలోకి అక్రమంగా చొరబడిన ఘూజీ జలాంతర్గామి మునిగిపోవడంతో అందులోని 93 మంది మరణించారు.

మహారాష్ట్ర మాజీ సీఎం మనోహర్ జోషి మృతి

ముంబై, ఫిబ్రవరి 23 (నమస్తే తెలంగాణ): మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, లోక్‌సభ మాజీ స్పీకర్ మనోహర్ జోషి(86) శుక్రవారం కన్నుమూశారు. జోషికి గురువారం రాత్రి గుండెపోటు వచ్చింది. చికిత్స నిమిత్తం హిందుజా దవాఖానలో చేర్పించారు. అయితే చికిత్స పొందుతూ ఆయన మృతి చెందారు. శివసేన వ్యవస్థాపకుడు బాలాసాహెబ్ ఠాక్రే సన్నిహితులలో జోషి ఒకరు. ముంబై మేయర్‌గా, శాసన మండలి సభ్యులుగా, ఎమ్మెల్యేగా, ప్రతిపక్ష నేతగా, శివసేన తొలి ముఖ్యమంత్రిగా అనేక పదవులు నిర్వహించారు. 1968లో ముంబై కార్పొరేషన్ కౌన్సిలర్‌గా ఎన్నికై రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు. 1995-99 మధ్యకాలంలో జోషి మహారాష్ట్ర సీఎంగా పనిచేశారు. 2002-04 మధ్య వాజ్‌పేయి సర్కారు అధికారంలో ఉన్నప్పుడు లోక్‌సభ స్పీకర్‌గా సేవలందించారు.

షుగర్ లెవెల్స్ కొలవడానికి స్మార్ట్‌వాచ్, రింగ్‌లు వాడొద్దు!

అమెరికా ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ హెచ్చరిక

న్యూఢిల్లీ: ఆరోగ్య పరిరక్షణలో భాగంగా వాకింగ్, జాగింగ్ తదితర వ్యాయామాలు చేసే వారు రిస్ట్‌కు స్మార్ట్ వాచ్‌లను, బ్యాండ్‌లు, రింగ్‌లను ఉపయోగించటం కామన్‌గా మారింది. ఎన్ని కాలరీలు ఖర్చు చేశాం వంటి వివరాల వరకు ఓకే కానీ.. ప్రతీది స్మార్ట్ వాచ్‌పైనే ఆధారపడితే లాభం లేదంటున్నారు నిపుణులు. స్మార్ట్ వాచ్‌లు, రింగ్‌ల ద్వారా మీ బ్లడ్‌లో షుగర్ లెవెల్ ఎంతుంది? అని ఎప్పుడూ పరీక్షించుకోకండి.. ఇది ప్రాణాంతకంగా మారే ప్రమాదమున్నదని అమెరికన్ ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ విభాగం హెచ్చరిస్తున్నది. సాధారణంగా బ్లడ్‌లో షుగర్ లెవెల్ తెలుసుకోవటానికి సూదితో గుచ్చి రక్తం తీసి గానీ తెలుసుకోలేం.. కానీ రకరకాల బ్రాండ్ల పేరిట స్మార్ట్ వాచ్‌లు, రింగ్‌ల ద్వారా మీ బ్లడ్ షుగర్ లెవెల్ తెలుసుకోవచ్చంటూ ప్రచారం చేస్తున్నారు. ఇవి ఇచ్చే సమాచారం సరైనది కాదని, ఇలా తప్పుడు సమాచారంతో షుగర్‌కు వాడే మందుల మోతాదులు మారే అవకాశమున్నదని, అలా చేయటం వల్ల కొన్ని సార్లు ప్రాణాల మీదకు వస్తుందని ఎఫ్‌డీఏ హెచ్చరించింది.

బుల్లి వాషింగ్ మెషీన్ భళా!

ఏపీ కుర్రాడి గిన్నిస్ రికార్డ్

న్యూఢిల్లీ: ఏపీకి చెందిన సాయి తిరుమలనీది అనే కుర్రాడు ప్రపంచంలోనే అతి చిన్న వాషింగ్ మెషీన్ తయారుచేసి ప్రపంచం దృష్టిని ఆకర్షించాడు. గిన్నిస్ బుక్‌లోనూ స్థానం సంపాదించాడు. ఇతడి అసాధారణ ప్రయత్నాన్ని గిన్నిస్ బుక్ బుధవారం తన ఇన్‌స్టాగ్రామ్ పేజీలో ప్రదర్శించింది. ఈ యంత్రం పనితీరుపై పలువురు ఆసక్తి కనబరిచారు. 37మి.మీx41మి.మీx43మి.మీ కొలతలతో సాయి ఈ యంత్రాన్ని రూపొందించాడు' అని గిన్నిస్‌బుక్ పేర్కొంది.

లిక్విడ్ యూవీ స్క్రీన్ ప్రొటెక్టర్స్ వద్దు!

కస్టమర్లకు 'షామీ' సూచన

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23: స్మార్ట్‌ఫోన్లకు లిక్విడ్ యూవీ స్క్రీన్ ప్రొటెక్టర్లను వాడొద్దని ప్రముఖ మొబైల్‌ఫోన్ తయారీ సంస్థ 'షామీ' వినియోగదారులకు సూచించింది. వాటిల్లో ద్రవరూపంలో ఉండే రసాయన జిగురు స్మార్ట్‌ఫోన్ చార్జింగ్ పోర్ట్, స్పీకర్, ఇతర భాగాల్లోకి వెళ్లి.. ఫోన్ పనితీరును దెబ్బతీస్తుందని హెచ్చరించింది. దీంతో పరికరం వారంటీ పూర్తి కాలం రాదని తెలిపింది. ఈ మేరకు కంపెనీ తాజాగా వినియోగదారుల కోసం ఓ అడ్వైజరీ విడుదల చేసింది. లిక్విడ్ యూవీ ప్రొటెక్టర్స్ కాకుండా, టెంపర్డ్, నాన్-టెంపర్డ్ గ్లాస్, ఎలక్ట్రోస్టాటిక్ ఫిల్మ్స్‌ను వాడొచ్చుని, స్మార్ట్‌ఫోన్ల పనితీరుకు, వాటి లైఫ్‌టైమ్‌కు సురక్షితమని పేర్కొన్నది.

ఇక రైళ్లలోనూ స్విగ్గీ సేవలు

తొలి దశలో నాలుగు స్టేషన్లలో అమలు

న్యూఢిల్లీ: దేశంలో ప్రముఖ ఫుడ్ డెలివరీ సంస్థగా ఉన్న స్విగ్గీ.. ఇకపై తన సేవలను రైలు ప్రయాణికులకు కూడా విస్తరించనున్నది. ఐఆర్‌సీటీసీ ఈ-క్యాటరింగ్ పోర్టల్ ద్వారా ప్రయాణికులకు ప్రీ-ఆర్డర్డ్ మీల్స్‌ను(ముందస్తుగా ఆర్డర్ చేసిన ఆహారం) అందించనున్నది. ఈ మేరకు భారత రైల్వేతో స్విగ్గీ జట్టు కడుతున్నది. స్విగ్గీ ఫుడ్స్‌తో కలిసి ఈ-క్యాటరింగ్ సేవలు త్వరలో ప్రారంభం కానున్నట్టు ఐఆర్‌సీటీసీ తాజాగా స్టాక్ ఎక్స్చేంజ్ వద్ద ఫైలింగ్‌లో పేర్కొన్నది. రైలు ప్రయాణికులకు స్విగ్గీ ద్వారా ఫుడ్ డెలివరీ సేవలు మొదటి దశలో భాగంగా విజయవాడ, విశాఖపట్నం, బెంగళూరు, భువనేశ్వర్ రైల్వేస్టేషన్లలో అందుబాటులో ఉంటాయని ఐఆర్‌సీటీసీ ఓ ప్రకటనలో పేర్కొన్నది.

దంపతుల్లో ఎవరికైనా వైద్య సమస్యలుంటేనే అద్దె గర్భానికి అనుమతి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23: అద్దె గర్భం (సరగసీ) ద్వారా సంతానాన్ని పొందేందుకు ప్రస్తుతం ఉన్న నిబంధనలను కేంద్ర ప్రభుత్వం సవరించింది. తద్వారా దంపతుల్లో ఎవరో ఒకరు వైద్య సమస్యతో బాధపడుతున్నట్టయితేనే దాత అండాన్ని లేదా వీర్యాన్ని ఉపయోగించుకునేందుకు వీలు కల్పించింది. ఈ పద్ధతిలో సంతానాన్ని పొందాలనుకునే భర్త లేదా భార్యకు వైద్యపరమైన సమస్య ఉన్నట్టు జిల్లా మెడికల్ బోర్డు ధ్రువీకరించాల్సి ఉంటుందని, అప్పుడే దాత బీజకణంతో అద్దె గర్భం ద్వారా సంతానాన్ని పొందేందుకు వీలవుతుందని బుధవారం జారీచేసిన నోటిఫికేషన్‌లో కేంద్రం స్పష్టం చేసింది. అంటే.. దంపతులిద్దరూ వైద్య సమస్యలతో బాధపడుతున్నా లేక వారికి సొంత బీజకణాలు లేకపోయినా సరగసీని ఎంచుకునేందుకు వీలుండదు.

గ్రామాల్లో 15 రోజుల్లో విద్యుత్తు కనెక్షన్

న్యూఢిల్లీ: కొత్త విద్యుత్తు కనెక్షన్లు పొందడాన్ని సులభతరం చేస్తూ కేంద్రం నిబంధనలు సవరించింది. గ్రామాల్లో 15 రోజుల్లోగా కొత్త కనెక్షన్ ఇవ్వనున్నారు. మెట్రోపాలిటన్ నగరాల్లో మూడు రోజుల్లోగా, పురపాలికల్లో వారంలోగా వాటిని పొందవచ్చు. ఈ మేరకు విద్యుత్తు(వినియోగదారుల హక్కులు) నిబంధనలు-2020కి సవరణలు చేసినట్టు కేంద్ర విద్యుత్తు శాఖ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. రూఫ్‌టాప్ సోలార్ ఇన్‌స్టలేషన్లను కూడా సులభతరం చేయనున్నట్టు కేంద్రం చెప్పింది. దీనికి సంబంధించిన బిల్లింగ్ విధానాన్ని కూడా కామన్ ఏరియా లేదా వ్యక్తిగత క్యాటగిరీ కింద ఎంపిక చేసుకొనే స్వేచ్ఛ కస్టమర్‌కు ఉంటుందని తెలిపింది. కస్టమర్లు విద్యుత్తు వాహనాల చార్జింగ్ కోసం ప్రత్యేక కరెంట్ కనెక్షన్ పొందవచ్చు. సహకార గృహ సంఘాలు కరెంటు కనెక్షన్లు పంపిణీ లైసెన్సులను ప్రతి ఒక్కరికీ వ్యక్తిగతంగా పొందవచ్చు లేదా మొత్తం గృహాల సముదాయానికి సింగిల్ పాయింట్ కనెక్షన్ పొందవచ్చు. మీటర్ రీడింగ్‌పై కస్టమర్లు ఫిర్యాదు చేసినప్పుడు డిస్ట్రిబ్యూషన్ లైసెన్సుదారుడు ఐదు రోజుల్లోపు అదనపు మీటర్‌ను బిగించాలి.

సిద్ధరామయ్య సర్కారుకు ఎదురుదెబ్బ

మండలిలో వీగిపోయిన 'ఆలయాలపై పన్ను' బిల్లు

బెంగళూరు, ఫిబ్రవరి 23: కర్ణాటకలో సిద్ధరామయ్య నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎదురుదెబ్బ తగిలింది. ఆలయాలపై పది శాతం పన్ను విధించేలా రూపొందించిన బిల్లు శుక్రవారం శాసనమండలిలో వీగిపోయింది. ఇదే బిల్లు రెండు రోజుల ముందు శాసనసభలో ఆమోదం పొందిన సంగతి తెలిసిందే. కాంగ్రెస్ ప్రభుత్వం హిందూ వ్యతిరేక విధానాలు అమలు చేస్తున్నదన్న ప్రతిపక్ష బీజేపీ ఆరోపణలు కర్ణాటకలో దుమారం రేపాయి. శాసనసభలో కాంగ్రెస్‌కు బలముంటే.. శాసన మండలిలో బీజేపీకి సంఖ్యా బలం ఎక్కువ.

భార్య పేరిట కొన్నది కుటుంబ ఆస్తే!

అలహాబాద్ హైకోర్టు తీర్పు

ప్రయాగరాజ్, ఫిబ్రవరి 23: స్వతంత్రంగా ఆదాయ వనరులు లేని, కేవలం గృహిణిగా ఉన్న వారి పేరిట వారి భర్తలు కొనుగోలు చేసిన ఆస్తి కుటుంబ ఆస్తిగానే పరిగణించాలని అలహాబాద్ హైకోర్టు పేర్కొన్నది. హిందూ భర్తలు తమ భార్యల పేరిట ఆస్తులు కొనటం సర్వసాధారణమని జస్టిస్ అరుణ్‌కుమార్ సింగ్ దేశ్వాల్ అన్నారు. మరణించిన తన తండ్రి ఆస్తికి సహ యాజమాన్యాన్ని ప్రకటించాలని ఓ కొడుకు వేసిన పిటిషన్ విచారణ సందర్భంగా న్యాయమూర్తి ఈ తీర్పునిచ్చారు. భారతీయ సాక్ష్యాధారాల చట్టంలోని సెక్షన్ 114 ప్రకారం స్వతంత్రంగా ఆదాయం లేని భార్య పేరుతో కొన్న ఆస్తి ఆ కుటుంబ ఆస్తి అవుతుందని స్పష్టం చేశారు. భార్య సంపాదించిన ఆదాయంతో ఆస్తిని కొన్నట్టు రుజువు చేయకపోతే ఆ ఆస్తిని భర్త సంపాదనతో కొన్నట్టు పరిగణించాలని న్యాయమూర్తి పేర్కొన్నారు.

బెంగళూరులో నీటి సంక్షోభం

- గుక్కెడు నీటి కోసం జనం అష్టకష్టాలు
- చోద్యం చూస్తున్న కాంగ్రెస్ సర్కార్

బెంగళూరులో నీటి పరిరక్షణపై ప్రచారం నిర్వహిస్తున్న విద్యార్థులు

బెంగళూరు, ఫిబ్రవరి 23: వేసవికి ఇంకా కొన్ని వారాల సమయమున్నది. అప్పుడే బెంగళూరు మహానగరం తీవ్రమైన నీటి కొరతను ఎదుర్కొంటున్నది. ఇదే అదనుగా ప్రైవేటు ట్యాంకర్ల మాఫియా ధరలు రెండింతలు పెంచేసిందని స్థానికులు వాపోతున్నారు. భారత దేశ సిలికాన్ వ్యాలీని జనవరి మధ్య నుంచే నీటి కొరత పట్టిపీడిస్తున్నదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఓ వైపు తగ్గిపోతున్న భూగర్భ జలాలు, దీనికి తోడు ట్యాంకర్ల అధిక ధరలు నగరవాసుల కష్టాలను మరింత పెంచుతున్నాయి. ఐటీ కంపెనీలు, స్టార్టప్‌లకు నిలయమైన బెంగళూరులో కోటి జనాభా నివసిస్తున్నది. వర్షాభావం, బోర్‌వెల్స్ ఎండిపోవటం, భూగర్భ జలాలు అడుగంటిపోవటం, మౌలిక సదుపాయాలు కల్పించకపోవటం, ట్యాంకర్ల దోపిడీ, కాంగ్రెస్ సర్కారు అలసత్వం.. అన్నీ కలిసి నగరాన్ని నీటి సంక్షోభంలో ముంచేశాయి.

ట్యాంకర్ మాఫియా ఆగడాలు

నగర నీటి సరఫరాకు బాధ్యత వహించే బెంగళూరు నీటి సరఫరా, మురుగునీటి బోర్డు (బీడబ్ల్యూఎస్ఎస్బీ) నగర నీటి అవసరాలు తీర్చటానికి అధికంగా కావేరీ నదిపై ఆధారపడుతున్నది. కావేరీ నీటి కనెక్షన్లు లేని ప్రాంతాలు బోర్‌వెల్స్, ట్యాంకర్లపై ఆధారపడుతున్నాయి. కావేరీ నది నుంచి బెంగళూరు నగరానికి రోజుకు 1450 మిలియన్ లీటర్ల నీటిని సరఫరా చేస్తున్నారు. కానీ నగరానికి మరో 1680 మిలియన్ లీటర్ల అవసరం ఉన్నది. ఈ నేపథ్యంలో ప్రజలు తమ నీటి అవసరాలు తీర్చుకునేందుకు ట్యాంకర్లపై ఆధారపడుతున్నారు. గత రెండు నెలల్లోనే ట్యాంకర్ల ధరలు రెట్టింపు అయ్యాయి. ఒక ప్పుడు ప్రైవేటు ట్యాంకర్ రూ.1500లకు వస్తుండగా.. ఇప్పుడు దాని రేటు రెట్టింపు అయ్యింది. నెలకు ప్రైవేటు ట్యాంకర్లపైనే సుమారు రూ.6 వేల దాకా ఖర్చు చేస్తున్నారు. గతంలో ఈ ఖర్చు కేవలం రూ.700 ఉండేది. జనవరి మధ్య నుంచే నీటి ట్యాంకర్ల రేట్లు విపరీతంగా పెరిగాయని స్థానికులు వాపోతున్నారు. 12 వేల లీటర్ల ట్యాంకర్ ధర ఒకప్పుడు రూ. 1200 కాగా.. ఇప్పుడది రూ.2000 దాటిపోయింది.



చంద్రుడిపైకి తొలి ప్రైవేట్ ల్యాండర్

చరిత్ర సృష్టించిన అమెరికా కంపెనీ

వాషింగ్టన్, ఫిబ్రవరి 23: చంద్రుడి ఉపరితలంపై తొలిసారిగా ఒక ప్రైవేటు ల్యాండర్ అడుగు పెట్టి చరిత్ర సృష్టించింది. అంతరిక్ష యాత్రల వాణిజ్యీకరణలో భాగంగా అమెరికాకు చెందిన 'ఇన్ట్యూటివ్ మెషీన్స్' అనే ప్రైవేటు సంస్థ ఈ ప్రయోగం చేపట్టింది. హ్యూస్టన్ కేంద్రంగా పనిచేసే ఇన్‌ట్యూటివ్ మెషీన్స్ కంపెనీ రూపొందించిన 'ఒడిస్సెస్' గురువారం సాయంత్రం 6.23 గంటలకు చంద్రుడి ఉపరితలంపై అడుగుపెట్టిందని శాస్త్రవేత్తలు ప్రకటించారు. చంద్రుడి దక్షిణ ధ్రువానికి సమీపంలో ల్యాండ్ అయిందని పేర్కొన్నారు. నాసా 1972లో చేపట్టిన అపోలో-17 మిషన్ దాదాపు 50 ఏండ్ల తర్వాత చంద్రుడిపై కాలుమోపిన తొలి అమెరికా అంతరిక్ష నౌక ఇదే కావడం గమనార్హం. 'ఒడిస్సెస్' ద్వారా అమెరికా తిరిగి చంద్రుడిపై అడుగు పెట్టిందని నాసా అడ్మినిస్ట్రేటర్ బిల్ నెల్సన్ సంతోషం వ్యక్తం చేశారు.

తెగిన సంబంధాలు.. పునరుద్ధరణ

అయితే ఊహించినట్టుగానే 'ఒడిస్సెస్' ల్యాండర్ చంద్రుడిపై అడుగుపెట్టిన తర్వాత మొదటగా శాస్త్రవేత్తలకు దానితో సంబంధాలు తెగిపోయాయని ఎన్‌బీసీ న్యూస్ నివేదించింది. అనంతరం సమస్యను పరిష్కరించిన శాస్త్రవేత్తలు.. ల్యాండర్ సక్రమంగానే పనిచేస్తూ డాటా పంపడం ప్రారంభించిందని తెలిపారు.

ఏడు రోజుల పాటు సేవలు

ఒడిస్సెస్ ల్యాండర్ చంద్రుడి ఉపరితలంపై ఏడు రోజుల పాటు సేవలు అందించనున్నది. ఒడిస్సెస్ ల్యాండ్ అయిన ప్రాంతంలో చీకటి పడేందుకు మరో వారం మాత్రమే సమయం ఉన్నదని ఏబీసీ న్యూస్ పేర్కొన్నది.

పిండాన్నీ వదలని ప్లాస్టిక్ భూతం!



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23: గర్భిణుల్లో మైక్రోప్లాసిక్ రేణువులు పెరుగుతుండటంపై శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొత్త పరికరం ద్వారా గర్భిణుల మావిలో మైక్రోప్లాస్టిక్ అవశేషాలు గుర్తించినట్టు న్యూ మెక్సికో హెల్త్ సైన్సెస్ యూనివర్సిటీ సైంటిస్టులు వెల్లడించారు. టాక్సికాలజికల్ సైన్సెస్ జర్నల్‌లో ప్రచురితమైన వివరాల ప్రకారం.. సైంటిస్టులు 62 మంది గర్భిణుల శాంపిళ్లను పరిశీలిస్తే ప్రతి గ్రాము కణజాలంలో 6.5 నుంచి 790 మైక్రోగ్రాముల మైక్రోప్లాస్టిక్ కనిపించింది. ఈ సంఖ్య చూడటానికి చిన్నదిగా కనిపించినా ఆరోగ్యంపై ప్రభావం చూపించొచ్చని పరిశోధకులు అభిప్రాయపడ్డారు. ఈ ప్లాస్టిక్ రేణువులు మొదట గర్భస్థ మావి ఆ తర్వాత ఈ భూమిపై ఉన్న మొత్తం క్షీరదాల జీవితాలపై ప్రభావం చూపుతుందని పరిశోధనకు నేతృత్వం వహించిన మాథ్యూ కాంపెన్ ఆందోళన వ్యక్తం చేశారు.

ఇడ్లీ, వడతో జీవ వైవిధ్యానికి ముప్పు!

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23: భారతీయులు తినే పలు ఆహార పదార్థాలు జీవ వైవిధ్యానికి ముప్పు కలిగిస్తున్నాయని తాజా అధ్యయనం పేర్కొన్నది. ప్రపంచవ్యాప్తంగా 151 వంటకాలపై జరిపిన పరిశోధనల్లో 26 భారతీయ వంటకాల వల్ల జీవ వైవిధ్యానికి ఎక్కువ ముప్పు ఉన్నట్టు తేలిందట. వాటిలో ఇడ్లీ, వడ, చనా మసాలా, రాజ్మా, చపాతి సహా పలు ఆహార పదార్థాలున్నాయి. యూనివర్సిటీ ఆఫ్ సింగపూర్ పరిశోధకుల అధ్యయనంలో పర్యావరణంపై ఆహార పదార్థాల ప్రభావం వెలుగు చూసిందట. ఆహార ఉత్పత్తి జరిగే ప్రాంతాల్లో రకరకాల జీవ జాతులు ప్రభావితం అవుతాయని చెప్తున్నారు. వ్యవసాయం చేసే ప్రదేశాల్లో క్షీరదాలు, పక్షులు, ఉభయ చరాలపై పడే ప్రభావంపై పరిశోధకులు అంచనా వేశారు. బియ్యం, పప్పు ధాన్యాలతో కూడిన పదార్థాల వల్ల జీవ వైవిధ్యానికి అధిక ముప్పని పరిశోధనలో తేల్చారు. భారత్‌లో బియ్యం, పప్పు పంటల సాగుకు తరచుగా భూమి మార్పిడి అవసరమని, దీనివల్ల అనేక జీవజాతులు ఆవాసాలను కోల్పోతున్నాయని పరిశోధకులు చెప్తున్నారు.

జీ మెయిల్‌కు పోటీగా ఎక్స్ మెయిల్

ధ్రువీకరించిన ఎలాన్ మస్క్ • జీమెయిల్ ఆగదన్న గూగుల్

న్యూఢిల్లీ: ప్రపంచ వ్యాప్తంగా నేడు అత్యధికులు వినియోగించే జీమెయిల్ సేవలను గూగుల్ నిలిపివేయనున్నదన్న వదంతుల నేపథ్యంలో టెస్లా అధినేత ఎలాన్ మస్క్ కీలక ప్రకటన చేశారు. జీమెయిల్‌కు పోటీగా ఎక్స్ మెయిల్‌ను తీసుకురానున్నట్టు తెలిపారు. ఎక్స్ మెయిల్ ప్రారంభం తేదీ ఎప్పుడంటూ ఎక్స్ సెక్యూరిటీ ఇంజినీరింగ్ టీమ్‌లోని సీనియర్ సభ్యుడు నాథన్ మెక్‌గ్రాడి ట్వీట్ చేశారు. దీనిపై తక్షణమే స్పందించిన మస్క్.. త్వరలోనే ఎక్స్ మెయిల్ సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. 'గూగుల్ ఈజ్ సన్‌సెట్టింగ్ జీ మెయిల్' అంటూ గూగుల్ నుంచి వచ్చినట్టుగా చెబుతున్న ఓ మెయిల్‌కు సంబంధించిన స్క్రీన్‌షాట్ వైరలైంది. 2024 ఆగస్ట్ 1 నుంచి జీ మెయిల్ తన సర్వీస్‌ను నిలిపేస్తున్నట్టు అందులో ఉన్నది. దీనిపై ప్రపంచవ్యాప్తంగా విస్తృతంగా చర్చ జరిగింది. ఈ నేపథ్యంలో గూగుల్ అత్యవసరంగా స్పందించింది. జీ మెయిల్ ఆగిపోయే ప్రసక్తే లేదని తేల్చి చెప్పింది. తన వినియోగదారులకు భరోసా కల్పించటానికి ఎక్స్ వేదికనే ఎంచుకున్నది.

యుద్ధం ముగిసేనా?

రష్యా, ఉక్రెయిన్ పోరుకు రెండేండ్లు

రెండు వైపులా వేలాది మరణాలు ప్రపంచ ఆర్థికంపై తీవ్ర ప్రభావం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23: రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమై సరిగ్గా రెండేండ్లు గడిచాయి. అయితే ఈ సుదీర్ఘ యుద్ధం ముగిసేది ఎప్పుడు? గెలిచేది ఎవరు? అనేదానిపై స్పష్టత కనిపించడం లేదు. యుద్ధం ఉక్రెయిన్ ప్రజల జీవితాలను అస్తవ్యస్తం చేసింది. తమ లక్ష్యాలను సాధించిన తర్వాతే యుద్ధానికి ముగింపు ఉంటుందని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఇటీవల వ్యాఖ్యానించడం ప్రాధాన్యం సంతరించుకొన్నది. 2022, ఫిబ్రవరి 24న రష్యా సైనిక చర్య పేరుతో ఉక్రెయిన్‌పై దాడులు ప్రారంభించింది. రష్యా సైన్యం దాడులు.. ఉక్రెయిన్ బలగాల ప్రతి దాడులతో ఇది భీకర యుద్ధంగా మారింది. ఇరువైపులా వేలాదిగా సైనికులు, సాధారణ పౌరులు మరణించగా.. అంతకంటే ఎక్కువ సంఖ్యలో గాయపడ్డారు. మరణాల సంఖ్యపై రెండు దేశాలు అధికారిక ప్రకటనలు చేయకపోవడంతో, మృతి చెందిన వారి సంఖ్యపై స్పష్టత లేదు. కాగా, యుద్ధంలో రష్యా వైపు 1,20,00 మంది సైనికులు మరణించగా.. దాదాపు 1,80,000 మంది గాయపడ్డారని అమెరికా రక్షణశాఖ అధికారులు ఇటీవల పేర్కొన్నారు. అదేవిధంగా 70 వేల మంది ఉక్రెయిన్ జవాన్లు మరణించగా.. లక్ష మందికి పైగా గాయపడ్డారని తెలిపారు.

రష్యా దాడులకు సమర్థ ప్రతిఘటన

*రష్యా సైన్యం మెరుపు దాడులతో ఉక్రెయిన్